క్లుప్తంగా

నేడు యండగండిలో గడపగడపకూ..

కె.గంగవరం: మండలంలోని యండగండిలో నేడు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దీప్తి ఎంపిక



విద్యార్థిని దీప్తిని అభినందిస్తున్న హెచ్ఎం, వ్యాయామోపాధ్యాయులు

కపిలేశ్వరపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పలివెల దీప్తి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఆప్ స్టెప్ జెమ్ పోటీలో ప్రథమ, హై జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని దీప్తిని హెచ్ఎం వంగా శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు గుబ్బల వేణుగోపాలరావు, వాసంశెట్టి రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా పాదయాత్ర

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ తదితర వర్గీకరణ అనుకూల ప్రజా సంఘాలు కృషి చేస్తున్నాయని ఆయా సంఘాల నాయకులు అన్నారు. నవంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన పాదయాత్ర మండలంలోని నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు గ్రామాల మీదుగా సాగింది. వర్గీకరణ డిమాండ్ సాధన కోసం మాదిగ ఉప కులాల వారంతా పోరాడాలని అందులో భాగంగా చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ–రామచంద్రపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండపేట మండలం ద్వారపూడి నుంచి రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వరకు రూ.25 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వారపూడి నుంచి మండపేట వరకు రోడ్డు నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. ద్రాక్షారామలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో జేసీబీ, రోడ్డు రోలర్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి అనువుగా బీటీ రోడ్డు చదును చేశారు.

రైతులకు మేలు జరిగేలా ధాన్యం సేకరణ

సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సుధాసాగర్

మండపేట: రైతులను అన్నివిధాలా ఆదుకోవాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ చేపట్టాలని, వారికి ఎటువంటి ఇబ్బందులూ రాకుండా జాగ్రత్తగా పని చేయాలని సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సుధాసాగర్ అన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై వివిధ మండలాలకు చెందిన ఆర్బీకే సిబ్బందికి శుక్రవారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆయన శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 3.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. దీనికి 95 లక్షల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని తెలిపారు. కళ్లాల వద్దకే వెళ్లి, ధాన్యం నమూనాలు సేకరించాలని చెప్పారు. గతంలో తేమ శాతం సరిగా తీయలేదంటూ ఫిర్యాదులు వచ్చినందున సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. తేమ శాతంలో వ్యత్యాసం వలన రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలన్నారు. దీని ధర రూ.2,800 అని, ఆ మొత్తాన్ని వాహన యజమాని భరించాలని, లేకుంటే ఈ పరికరం ఏర్పాటు చేసి, ఆ మొత్తాన్ని వాహన యజమానికి చెల్లించే రవాణా చార్జీల నుంచి మినహాయిస్తామని తెలిపారు. లోడింగ్, వాహనానికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు చేయాలని లేకుంటే రవాణాదారుకు వెళ్లాల్సిన రవాణా చార్జీలు రైతుల ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. గన్నీబ్యాగ్‌లను రొటేషన్‌లో ఉంచాలని, వంద గన్నీ బ్యాగ్‌లు పంపిస్తే మిల్లరు నుంచి మరో 100 గన్నీ బ్యాగ్‌లు తిరిగి వచ్చేలా చూడాలని సూచించారు. దీని వలన రవాణా వేగవంతం చేసేందుకు వీలుంటుందని సుధాసాగర్ చెప్పారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ మద్దతు ధర కంటే బయట ఎక్కువ వస్తే రైతు నేరుగా విక్రయించుకునేందుకు ఎటువంటి అభ్యంతరమూ ఉండదని తెలిపారు. సమస్య లుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్బీకే సిబ్బందికి పవర్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు సన్నాహాలు

- చలువ పందిళ్లను తీర్చిదిద్దుతున్న ఉత్సవ కమిటీలు
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

రాయవరం: చెడుపై మంచి విజయం సాధించినందుకు గుర్తుగా జరుపుకునే శరన్నవరాత్ర వేడుకలకు ఊరూవాడా సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఉత్సవాలను ఇప్పుడు వాటికి ఏమాత్రం తీసిపోని విధంగా పల్లెల్లో కూడా చేపడుతున్నారు. ప్రతి గ్రామంలోను ఉత్సవ కమిటీలు ఏర్పడి దుర్గాదేవికి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో 120 గ్రామాలు ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే రాట ముహూర్తాలు నిర్వహించారు. మండపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, కాజులూరు, కుయ్యేరు, ద్వారపూడి, రాయవరం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠం, మాచవరం, రాయవరం, లొల్ల, పసలపూడి, కపిలేశ్వరపురం, అంగర, టేకి, వల్లూరు, కోరుమిల్లి, కేదారిలంక తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

సిద్ధమైన చలువ పందిళ్లు

ఈ నెల 15 నుంచి ప్రారంభమై ఈ నెల 24 వరకూ నిర్వహించే శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామగ్రామానా చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఐదుచోట్ల ఉత్సవ కమిటీలు అమ్మవారిని నిలుపుతున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై గ్రామాలకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



రాయవరంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాదేవి ఆలయం

పీఠంలో విజయదుర్గా అమ్మవారి అవతారాలు ఇలా

తేదీ	అవతారం
15న	రజత కవచ అలంకృత విజయదుర్గాదేవి
16న	శ్రీబాలాత్రిపురసుందరి
17న	శ్రీగాయత్రీదేవి
18న	శ్రీఅన్నపూర్ణాదేవి
19న	శ్రీమహాలక్ష్మీదేవి
20న	శ్రీసరస్వతీదేవి
21న	శ్రీలలితాసుందరీదేవి
22న	శ్రీదుర్గాదేవి
23న	శ్రీమహిషాసురమర్దినీదేవి/శ్రీరాజరాజేశ్వరీదేవి



వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

పీఠంలో ఏర్పాట్లు పూర్తి..

మండలంలోని వెదురుపాక గ్రామంలోని విజయదుర్గా పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు పీఠంలో కొలువైన విజయదుర్గ అమ్మవారిని రోజుకొక రీతిలో అలంకరిస్తారు. భక్తులు స్వయంగా కలశాన్ని పీఠంలో ఏర్పాటు చేసుకుని నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీ. అమ్మవారికి ఎదురుగా పీఠంలో కలశాలను భక్తులు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పీఠం భక్తజన కమిటీ తెలిపింది.

అమ్మ అనుగ్రహం కోసం..



అమ్మవారి కృపా కటాక్షాలు ఉంటే సకల శుభాలు కలుగుతాయి. నవరాత్రుల్లో అమ్మవారిని కొలవడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. పాడిపంటలు, పసుపు కుంకాలు, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండేందుకు అమ్మవారిని రోజుకొక రూపంలో కొలవడం భక్తుల విశ్వాసానికి ప్రతీక.

– విలపర్తి ఫణిధర్‌శర్మ, పురోహితుడు, రాయవరం

ఏర్పాట్లు పూర్తి చేశాం



పీఠంలో విజయదుర్గా అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశాం. తొమ్మిది రోజులు వివిధ సాహితీవేత్తలు పురాణ పఠనం చేస్తారు.

– వాడ్రేవు వేణుగోపాల్ (బాబి), పీఆర్వో, విజయదుర్గాపీఠం, వెదురుపాక

శరన్నవరాత్ర మహోత్సవాలకు మంత్రి వేణుకు ఆహ్వానం



మంత్రి వేణును దసరా ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న సర్పంచ్ సూరిబాబు, ఈఓ సత్యనారాయణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్ర మహోత్సవాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను శుక్రవారం ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు ఆహ్వానించారు. 15 నుంచి 21 వరకు ప్రతిరోజు శ్రీచక్రపూజ, నవావరణార్చన, 20న మధ్యాహ్నం 3 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, 24న విజయదశమి, శమీపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా విజయ దశమి వేడుకలు

మండపేట: పట్టణంలోని సంఘం కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో విజయదశమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ దసరా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆధునిక పరిస్థితుల ప్రభావంతో అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పప్పు బెల్లాలను పంచి పెట్టారు. ఉపాధ్యాయులు చిట్టూరి వెంకటశ్రీధర్, పి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు పేదరికమే ప్రామాణికం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అర్తమూరులో గడప గడపకూ..



ఎమ్మెల్సీ తోటకు స్వాగతం పలుకుతున్న స్థానికులు. చిత్రంలో సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి

మండపేట: రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి పేదవాడికీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేత తోట పృథ్వీరాజ్, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి అర్తమూరులోని పెద్దనూతి సెంటర్, పల్లపువీధి, చింతల తోట ప్రాంతాల్లో త్రిమూర్తులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఎమ్మెల్సీ తోటకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ అనిల్‌కుమార్‌కు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లలో చేసిన ప్రగతిని వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. ఎస్బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, సొసైటీ చైర్మన్లు కొవ్వూరి నాగిరెడ్డి, పెంకే గంగాధర్, వైఎస్సార్ సీపీ నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, కర్రి వీర్రెడ్డి, మండ నాగిరెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, పంపన సుబ్బారావు, కర్రి గనిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు బుచ్చిరెడ్డి సమకూర్చిన స్పోర్ట్స్ యూనిఫాం అందజేస్తున్న నాయకులు

కాజులూరు: గ్రామాలలోని పాఠశాలలు, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారాలు మరువలేనివని వారి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఇతరులకు సహాయపడాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 10వ అంతర్ జిల్లాల సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో బాలుర విభాగానికి 16 మంది క్రీడాకారులను, బాలికల విభాగానికి 16 మంది క్రీడాకారులను అధికారులు ఎంపిక చేసి గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కాకినాడ రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి సమకూర్చిన స్పోర్ట్స్ యూనిఫాంను గుబ్బల ఏసురాజు, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్ఎంసీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వరరెడ్డి క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మాచారెడ్డి, మాజీ ఎంపీటీసీ మేడిశెట్టి వెంకటరమణమ్మ, పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలమణి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్, స్కూల్ పీడీ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారా, మద్యం బాటిళ్ల ధ్వంసం

రాయవరం: వివిధ కేసుల్లో పట్టుబడిన సారా, మద్యం బాటిళ్లను శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆధ్వర్యంలో వాటిని ధ్వంసం చేశారు. 32 లీటర్ల సారా, 750 ఎంఎల్ గల 20 మద్యం సీసాలను డిస్ట్రాయ్ చేశారు.

'తొరాటి' త్యాగం అజరామరం



అంగరలో తొరాటి స్మారక స్థూపం వద్ద వీర్రాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీర మరణం పొందిన అంగరకు చెందిన తొరాటి లక్ష్మణమూర్తి ప్రాణ త్యాగం అజరామరమని ఆయన 97వ జయంతిలో పాల్గొన్న వక్తలన్నారు. అంగరలోని తొరాటి స్మారక స్థూపం వద్ద శుక్రవారం ప్రముఖులు నివాళి అర్పించారు. చప్పిడిపాలెం వద్ద ఉన్న తొరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం, గాంధీ సెంటర్‌లోని నిలువెత్తు విగ్రహం వద్ద సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు జిత్తుక చిన వీర్రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, అంగర, పడమర ఖండ్రిక పంచాయతీల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతకు సీఎం భరోసా

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- సురక్ష శిబిరం ప్రారంభం



కాజులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాజులూరు గ్రామ సచివాలయం–1 ఆవరణలో శుక్రవారం వైద్యాధికారులు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు నాగార్జున, ఎం.తేజ, స్వాతి, సుప్రియ, సౌజన్య, సురేఖ తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 576 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పలు పథకాలను రూపొందించారన్నారు. ప్రజారోగ్యం కోసం పెద్ద ఎత్తున పథకాలు రూపొందిస్తున్న గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, సర్పంచ్ దండంగి సరోజని, యాళ్ల సత్తిబాబు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కె.గంగవరంలోని ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు ఈదర రమేష్, కోటి వెంకట్రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చోడవరంలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు 514 మంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. గ్రామ సచివాలయ పరిధిలోని చోడవరం మాలపాడు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున వైద్య సేవలు కోసం బారులు తీరారు. సర్పంచ్‌లు నేదూరి సంతోషమ్మ, గంటా సుజన ప్రియాంక, ఎంపీటీసీ సాదే సుభద్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రపురం సబ్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుదర్శన్‌బాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో 14 రకాల ల్యాబ్ పరీక్షలు నిర్వహించి, స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందించి, 118 రకాల మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీలు రెడ్డం సతీష్, నురుకుర్తి శ్రీరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి రాఘవ, జగ్జీవన్, సంతోష్, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శి పిల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్. ప్రశాంతి, ఎస్‌వీ ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సేవలు అందించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

మండపేట: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మండలంలోని మారేడుబాకలో శుక్రవారం సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబుతో కలిసి చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్య భద్రత కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెంకన్నబాబు మాట్లాడుతూ తండ్రిని మించిన తనయునిగా సీఎం జగన్ పేదల కోసం ఆలోచన చేస్తున్నారన్నారు. కులమతాలు, వర్గాలకు అతీతంగా పనిచేస్తున్న ఆయనకు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. శిబిరంలో 390 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ సాయిప్రసాద్‌లు శిబిరం వద్ద ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పార్టీ నాయకులు పులగం శ్రీనివాస్, యరమాటి వెంకన్నబాబు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చోడవరం సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న గ్రామస్తులు



కె.గంగవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కేదారిలంకలో 656 మందికి ఆరోగ్య పరీక్షలు

కపిలేశ్వరపురం: కేదారిలంకలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 656 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి హర్ష పర్యవేక్షణలో అంగర పీహెచ్‌సీ వైద్యురాలు గీతాంజలి తదితరులు రోగులకు పరీక్షలు చేశారు. ఎముక, గర్భకోశ, చిన్నారులు, కంటి సమస్యలపై అధునాతన పరికరాలతో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మారేడుబాకలో కంటి పరీక్ష చేయించుకుంటున్న వెంకన్నబాబు, చిత్రంలో చైర్‌పర్సన్ దుర్గారాణి



కేదారిలంక సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవేణి

జగనన్న ఆరోగ్య సురక్ష చరిత్రాత్మకం

- కూర్మాపురంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైద్య శిబిరాల్లో ఉచితంగా రోగులకు వైద్యం

రాయవరం: పేదలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కూర్మాపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ చౌటుపల్లి చక్రవేణి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరానికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తోందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైద్యాధికారులు రమ్యశ్రీ, కన్యాకుమారి, శ్రీనివాస్, రాము, కంటి వైద్యులు ఎంఈఆలీ తదితరులు 468 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు మాట్లాడారు. ఐదుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యురాలు వాసంశెట్టి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు చౌటుపల్లి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి, కందర్ప హనుమాన్, కొలగాని సత్తిబాబు, వాసంశెట్టి సూరిబాబు, పరంశెట్టి వెంకటరమణ, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ పాల్గొన్నారు.



కూర్మాపురం శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు